RNI NO. TELTEL2010/34557
www.deshatimes.in

# దేశ టైమ్స్ DESHA TIMES

తెలుగు దిన పత్రిక
నిజం.. నిర్భయం.. నిరంతరం

దేశ టైమ్స్
DESHA TIMES
16 సంవత్సరాలుగా వెలువడుతున్న "దేశ టైమ్స్" తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు, నియోజకవర్గాలు, మరియు మండలాల వారీగా విలేకరులు కావలెను..
సెల్ నెంబర్: 9849758280

నల్గొండ | సెప్టెంబర్ 7 సోమవారం 2026 | సంపుటి : 16 | సంచిక : 214 | పేజీలు : 4 | వెల రూ. 2.00/- | ఎడిటర్ : సయ్యద్ పాష

NALGONDA | MONDAY SEPTEMBER 7 2026 | VOL:16 | ISSUE: 214 | PAGES:4 | Rs. 2:00 | EDITOR:SAYED PASHA

# రెచ్చిపోతున్న... 'పేకాట' మాఫియా..!



**పోలీసుల దాడులు... నిర్వాహకుల ఎత్తుగడలు!**





**అడ్డాలు మారుతున్నాయి... జూదం మాత్రం ఆగడం లేదన్న ఆరోపణలు...**

**లాడ్జిలు.. రైస్‌మిల్లులు.. ఫంక్షన్ హాళ్లలోనూ పేకాట సాగుతున్నట్లు స్థానికుల ఆరోపణలు...**

**గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న వ్యవహారంపై నిఘా ఎక్కడ?**

**జిల్లాలో పేకాట మాఫియాకు పోలీసులు ఉక్కుపాదం మోపేనా...?**





**నిజామాబాద్ జిల్లా :**

కామారెడ్డి :బాన్సువాడ, సెప్టెంబర్ 6 : పేకాట మాఫియా మళ్లీ రెచ్చిపోతోందా..? పోలీసుల దాడులు జరుగుతున్నా నిర్వాహకులు కొత్త కొత్త ఎత్తుగడలతో జూదాన్ని కొనసాగిస్తున్నారన్న ఆరోపణలు స్థానికంగా కలకలం రేపుతున్నాయి. ఒకచోట పోలీసుల నిఘా పెరిగితే మరోచోటికి అడ్డా మార్చుకుంటూ పేకాట నిర్వహిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. కామారెడ్డి జిల్లాలోని జుక్కల్ బాన్సువాడ ఎల్లారెడ్డి నియోజకవర్గాలలోనీ మండల కేంద్రాలలో పట్టణ ప్రాంతాలలో పల్లెల్లో గ్రామ శివారులో పేకాట మాఫియా రోజురోజుకు అడ్డాలు మారుస్తూ జోరుగా జూదాన్ని సాగిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. బాన్సువాడ మండలంలోని కొత్తబాది, సింగితం, కోయ్యగుట్ట, ఇబ్రహీంపేట్ హనుమాజీపేట, కోనాపూర్, గాంధారి మండలం, నస్రుల్లాబాద్ మండలం, బీర్కూర్ మంజీర పరివాహక ప్రాంతం బాన్సువాడ పట్టణంలోని లాడ్జిలు రైస్ మిల్లు ఫంక్షన్ హాల్ లో నివాసపు ఇండ్లు వంటి అనేక స్థావరాల్లో గుర్తుచప్పుడు కాకుండా పేకాటను

(మిగతా 2వ పేజీలో..)

## హైదరాబాద్‌లో 'అహింసా స్థూపం'.. ఆవిష్కరించిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

**హైదరాబాద్ మియాపూర్‌లో 'అహింసా స్థూపం' ఏర్పాటు**

**అహింస బలహీనత కాదని, అదొక గొప్ప బలమని కిషన్ రెడ్డి వ్యాఖ్య**

**వికసిత్ భారత్ లక్ష్య సాధనకు ఐక్యత అవసరమని పిలుపు**

**సాంకేతికతతో పాటు సాంస్కృతిక విలువలను కాపాడుకోవాలని యువతకు హితవు**

కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి ఆదివారం హైదరాబాద్‌లోని మియాపూర్‌లో 'అహింసా స్థూపం' ఆవిష్కరించారు. శాంతి, అహింస అనే గొప్ప సందేశాన్ని సమాజంలో మరింత బలంగా చాటిచెప్పేందుకు ఈ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ, ఇది కేవలం ఒక కట్టడం ఆవిష్కరణ కాదని, శాంతి, అహింస వంటి

(మిగతా 2వ పేజీలో..)





## డీజీపీని ఉద్దేశిస్తూ ఘాటు వ్యాఖ్యలు చేసిన కవిత

**కవితపై సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేసిన కానిస్టేబుల్**

**కేవలం సస్పెండ్ చేసి సరిపెట్టారని కవిత మండిపాటు**

**కఠిన చర్యలు తీసుకోకపోతే ప్రభుత్వ పరువు తీస్తానని హెచ్చరిక**

తనపై సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేసిన కానిస్టేబుల్‌ను కేవలం సస్పెండ్ చేసి సరిపెట్టారంటూ తెలంగాణ రక్షణ సేన



(మిగతా 2వ పేజీలో..)

## కేసీఆర్ పై అనర్హత వేటు ??

**అసెంబ్లీ సమావేశాల్లో కీలక పరిణామానికి ఛాన్స్**

**కేసీఆర్ రాజీనామా చేయకపోతే అనర్హతా వేటు ?**

**సీఎం రేవంత్ రెడ్డి, కేబినెట్ మంత్రులతో మంతనాలు**

**,హైదరాబాద్:సెప్టెంబర్ 06**

హైద్రాబాద్ :తెలంగాణ రాజకీయం కేసీఆర్ అసెంబ్లీకి హాజరు కాకపోవడం చుట్టూ తిరుగుతోంది. శాసనసభకు హాజరుకాకుండా, ప్రతిపక్ష నేతగా బాధ్యతలు నిర్వర్తించకుండా వేల రూపాయల జీతభత్యాలు పొందుతున్నారంటూ

(మిగతా 2వ పేజీలో..)



## కెసిఆర్ నీకు తెలంగాణలో భవిష్యత్తు లేదు: సీఎం రేవంత్ రెడ్డి!

**,నల్గొండ జిల్లా:సెప్టెంబర్ 06**

నల్గొండ జిల్లా నకిరేకల్ నియోజకవర్గంలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, పర్యటన ప్రజ లు విజయవంతం చేశారు. నియోజక వర్గ ప్రగతి బాటలో భాగంగా.. మొత్తం రూ"344.92 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు శనివారం సీఎం రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టారు. నకిరేకల్ పట్టణంలోని రాజీవ్ గాంధీ స్టేడియంలో ఏర్పాటు చేసిన ప్రజా వికాస సభలో ఆయ న మాట్లాడుతూ..బిఆర్ఎస్ ప్రభుత్వం పై ఆయన నిప్పులు చెరిగారు తెలంగాణ తులసి వనంలో చీడ లా ఉన్న బీఆర్ఎస్ గంజాయి మొక్కను పీకేస్తామ ని,త్వరలో సిరిసిల్ల, సిద్దిపేటలపై దండయాత్ర చేస్తామ ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. బావ, బావమరుదులు బంధువులనే తెచ్చు కుంటారో, బానిసలనే తెచ్చుకుంటారో, చెంచాగాళ్లని

(మిగతా 2వ పేజీలో..)



# డీజీపీని ఉద్దేశిస్తూ ఘాటు వ్యాఖ్యలు చేసిన కవిత

(మొదటి పేజీ తరువాయి)

అధినేత్రి కల్వకుంట్ల కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలను దూషిస్తే మూడేళ్ల జైలు శిక్ష పడే చట్టాలు ఉన్నప్పటికీ పోలీసు యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని, సదరు కానిస్టేబుల్‌పై కఠిన చర్యలు తీసుకోకపోతే అంతర్జాతీయ స్థాయిలో ఈ ప్రభుత్వ పరువు తీస్తానని హెచ్చరించారు. బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన కవిత, "డీజీపీ గారికి ఇద్దరు కోడళ్లు ఉన్నారు. వారిపై ఇలాగే కామెంట్లు చేస్తే ఊరుకుంటారా? నాలాంటి ప్రజాప్రతినిధికే రక్షణ లేకపోతే సాధారణ మహిళల పరిస్థితి ఏమిటి?" అని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఈ డీజీపీ బాధ్యతలు స్వీకరించాకే క్రైమ్ రేటు పెరిగిందని, గంజాయి విక్రయాలపై సిగ్గుచేటు వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. ఎన్నికలకు ముందు తెలంగాణ ఉద్యమకారుల కాళ్లు పట్టుకున్న రేవంత్ రెడ్డి, అధికారంలోకి వచ్చాక మూడేళ్ల పాలనలో వారిని పూర్తిగా విస్మరించారని కవిత ధ్వజమెత్తారు. ఉద్యమకారుల్లో ఉన్న నమ్మకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం వమ్ము చేసిందని, ఇక మిగిలింది ఆమరణ దీక్ష మాత్రమేనని స్పష్టం చేశారు. రాబోయే అసెంబ్లీ సమావేశాల్లోనే ఉద్యమకారుల సంక్షేమంపై స్పష్టమైన గడువుతో కూడిన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని తప్పుడు లెక్కలు చూపిన కాంగ్రెస్, ఇప్పుడు బీసీల కోసం ధర్నాలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

## హైదరాబాద్‌లో 'అహింసా స్థూపం'.. ఆవిష్కరించిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

కాలాతీతమైన సిద్ధాంతాలను పరిరక్షించి, భవిష్యత్ తరాలకు అందించే గొప్ప ప్రయత్నమని స్పష్టం చేశారు. భగవాన్ మహావీరుడి సందేశమైన 'పరస్పరోపగ్రహో జీవానామ్' అనే సూక్తికున్న ప్రాధాన్యతను ఆయన వివరించారు. 'జీవులన్నీ పరస్పర మద్దతు, సహకారంతో ముడిపడి ఉంటాయి' అని దీని అర్థమని, ఈ సూక్తిని స్థూపంపై చెక్కారని తెలిపారు. ప్రపంచంలోని అనేక ప్రాంతాల్లో హింస, ఘర్షణలు కొనసాగుతున్న తరుణంలో పరస్పర గౌరవం, శాంతియుత సహజీవనం అనే సందేశం ఎంతో అవసరమని ఆయన నొక్కిచెప్పారు. భారత్ ఎల్లప్పుడూ అహింసా మార్గాన్నే అనుసరించిందని, కశ్మీర్‌లో హింసకు ముగింపు పలికి, శాంతిని పునరుద్ధరించడానికి ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం చేస్తున్న కృషిని ఈ సందర్భంగా ప్రస్తావించారు. అహింస అనేది బలహీనత కాదని, అదొక గొప్ప బలమని అన్నారు. అహింసా స్థూపం ఏర్పాటుకు చొరవ తీసుకోవడం ద్వారా 'నారీశక్తి' స్ఫూర్తిని, మహిళా నేతృత్వంలో జరుగుతున్న అభివృద్ధిని ఇది ప్రతిబింబిస్తోందని ప్రశంసించారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన జైన సమాజ మహిళలను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ప్రధాని మోదీ నాయకత్వంలో మహిళలే అభివృద్ధికి చోదకశక్తిగా నిలుస్తున్నారని, శాసనసభల్లో 33 శాతం రిజర్వేషన్లు కల్పించే 'నారీశక్తి వందన్ అధినియమ్' ఇందుకు నిదర్శనమని తెలిపారు. హైదరాబాద్ విభిన్న సంస్కృతులకు నిలయమని, నగరం సాధిస్తున్న ప్రగతి వెనుక ఈ వైవిధ్యమే కీలక శక్తిగా ఉందని కిషన్ రెడ్డి అభిప్రాయపడ్డారు. మహానగర ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక అభివృద్ధిలో జైన, బ్రాహ్మణ, మహేశ్వరి వంటి వర్గాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని కొనియాడారు. 'వికాస్ భీ, విరాసత్ భీ' (అభివృద్ధితో పాటు వారసత్వం) అనే స్ఫూర్తితో 'వికసిత్ భారత్ 2047' లక్ష్య సాధనలో హైదరాబాద్ ముఖ్యపాత్ర పోషిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సమాజాన్ని విచ్ఛిన్నం చేయడానికి ప్రయత్నిస్తున్న స్వార్థ శక్తులను ఓడించడానికి అందరూ ఏకం కావాలని పిలుపునిచ్చారు. నేటి యువత (జెన్-జీ) సాంకేతికతతో ప్రపంచాన్ని జయించాలని, అదే సమయంలో భారతీయ సాంస్కృతిక విలువలను ఎన్నడూ విస్మరించవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ కె. విశ్వేశ్వర్ రెడ్డి, జైన సమాజ ప్రతినిధులు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

## గణేశ్ ఆగమన్ కార్యక్రమంలో విషాదం .. విద్యార్థి మృతి



హైదరాబాద్‌లో గణేశ్ నవరాత్రులు ప్రారంభం కాకముందే విషాదం చోటుచేసుకుంది. ముషీ రాబాద్‌లోని రాంనగర్ చౌరస్తాలో నిర్వహించిన 'గణేశ్ ఆగమన్' కార్యక్రమంలో జరిగిన తొక్కిసలాటలో బద్రీనాథ్ (19) అనే ఇంజినీరింగ్ విద్యార్థి ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటనతో స్థానికంగా తీవ్ర విషాద ఛాయలు అలముకున్నాయి. ముషీరాబాద్‌లోని రాంనగర్ చౌరస్తాలో 'శ్రీ గణపతి యూత్ అసోసియేషన్' ఆధ్వర్యంలో వినాయక ఆగమన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకకు భారీ సంఖ్యలో భక్తులు, యువకులు తరలివచ్చారు. అయితే, ఒక్కసారిగా జనం గుమిగూడటంతో తీవ్ర తొక్కిసలాట చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బద్రీనాథ్ అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. బద్రీనాథ్ స్వస్థలం ఆంధ్రప్రదేశ్‌లోని కడప జిల్లా. ఆయన ప్రస్తుతం హైదరాబాద్ రాంనగర్‌లోని గౌరీశంకర్ అపార్ట్‌మెంట్‌లో నివసిస్తూ, అబిడ్స్‌లోని మెథొడిస్ట్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో బీటెక్ చదువుతున్నాడు. సమాచారం అందుకున్న ముషీరాబాద్ పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టినట్లు వెల్లడించారు.

# కేసీఆర్ పై అనర్హత వేటు ?

(మొదటి పేజీ తరువాయి)

కాంగ్రెస్ పార్టీ హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద మహా ధర్నా కు పిలుపునిచ్చింది. కేసీఆర్ వెంటనే తన శాసనసభ్యత్వానికి రాజీనామా చేయాలని లేదా అసెంబ్లీకి వచ్చి ప్రజాసమస్యలపై మాట్లాడాలని కాంగ్రెస్ స్పష్టం చేస్తోంది. ఈ పరిణామంతో కేసీఆర్ సభ్యత్వం , ఆయనపై అనర్హత వేటు పడే అవకాశాలపై చట్టపరంగా, రాజకీయంగా చర్చ మొదలైంది. శాసనసభ నిబంధనలు , భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 190(4) ప్రకారం.. ఒక సభ్యుడు సభ అనుమతి లేకుండా వరుసగా 60 రోజుల పాటు సమావేశాలకు హాజరుకాకపోతే, ఆ స్థానాన్ని ఖాళీగా ప్రకటన చేసే అధికారం సభకు ఉంటుంది. అయితే, ఇక్కడ 60 రోజులు అంటే క్యాలెండర్ రోజులు కాకుండా, అసెంబ్లీ సమావేశాలు జరిగిన రోజులను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటారు. గైర్హాజరీ సుదీర్ఘంగా కొనసాగినప్పుడు, అధికార పక్షం ఈ నిబంధనను ఆసరాగా చేసుకుని స్పీకర్ ద్వారా కేసీఆర్ సభ్యత్వాన్ని రద్దు చేయించే ప్రక్రియను ప్రారంభించే అవకాశం లేకపోలేదు. అయితే, కేసీఆర్‌ను అనర్హుడిగా ప్రకటించడం వెనుక సాంకేతిక అంశాల కంటే రాజకీయ పరిణామాలే కీలకంగా మారనున్నాయి. కేసీఆర్‌ను అనర్హుడిగా ప్రకటిస్తే గజ్వేల్ నియోజకవర్గానికి ఉపఎన్నిక అనివార్యమవుతుంది. ఒకవేళ కేసీఆర్‌ను అనర్హుడిగా ప్రకటిస్తే, అది ఆయన్ను రాజకీయంగా బాధితుడిగా ప్రొజెక్ట్ చేసుకోవడానికి బిఆర్ఎస్ పార్టీకి అవకాశం ఇచ్చినట్లవుతుందనే కోణం కూడా ఉంది. అందుకే చట్టపరమైన అనర్హత వేటు వేసే కంటే, ఆయన సభకు రాకపోవడాన్ని నెగెటివ్‌గా మార్చి రాజకీయంగా ఒత్తిడి పెంచడమే కాంగ్రెస్ వ్యూహంగా కనిపిస్తోంది. ప్రధాన ప్రతిపక్ష నేతగా ఉంటూ సభకు హాజరు కాకపోవడం ప్రజాస్వామ్య సూత్రాలకు విరుద్ధమని కాంగ్రెస్ బలంగా ప్రచారం చేస్తోంది. కేసీఆర్‌కు అనర్హత ముప్పు సాంకేతికంగా ఉన్నప్పటికీ, దాన్ని అమలు చేయడం కంటే ఆయన రాని వైనాన్ని ప్రజల్లో ఎండగట్టడం ద్వారా రాజకీయ ప్రయోజనం పొందాలనేది రేవంత్ రెడ్డి మార్క్ వ్యూహంగా భావిస్తున్నారు. ఈ మహా ధర్నా తర్వాత కాంగ్రెస్ తదుపరి అడుగు అసెంబ్లీ వేదికగా కేసీఆర్ తీరును ప్రజల్లోకి తీసుకెళ్లే అవకాశం ఉంది.

# కెసిఆర్ నీకు తెలంగాణలో భవిష్యత్తు లేదు: సీఎం రేవంత్ రెడ్డి!

(మొదటి పేజీ తరువాయి)

రప్పించుకుంటారో తేల్చుకోవాలని సవాల్ చేశారు. కేసీఆర్ కాస్కో.. రాష్ట్రంలో మళ్లీ రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమే. సవాల్ చేసి చెబుతున్నా.. ఇప్పుడున్న 119 సీట్లతోనే ఎన్నికలొస్తే 90 స్థానాలు, సీట్లు పెరిగితే 117 స్థానాల్లో కాంగ్రెస్ గెలుస్తుంది. 2034 వరకు ఇందిరమ్మ పాలన కొనసాగుతుంది. కేసీఆర్.. రాసి పెట్టుకో.. మీకు ఈ రాష్ట్రంలో భవిష్యత్ లేదు. ఇక చీకటే" అని స్పష్టం చేశారు. శనివారం నల్లగొండ జిల్లా నకిరేకల్‌లో పర్యటించిన సీఎం రేవంత్‌రెడ్డి.. రూ. 344 కోట్ల వ్యయంతో చేపట్టిన 12 అభివృద్ధి పనులతో పాటు.. రూ.32 కోట్ల వ్యయంతో నిర్మించిన 100 పడకల ప్రాంతీయ ఆస్పత్రిని ప్రారంభించారు. వచ్చే ఎన్నికల్లో సిరిసిల్ల, సిద్దిపేట ల్లోనూ కాంగ్రెస్ గెలుస్తుందని చెప్పారు. ఈ నెలాఖరులో సిరిసిల్లలో, వచ్చే నెలలో సిద్దిపేటపై దండయాత్ర చేస్తామని.. కాంగ్రెస్ శ్రేణుల అండతో పార్టీ జెండా రెపరెపలాడి స్తామని చెప్పారు. విపక్ష నేత కేసీఆర్ అసెంబ్లీకి రావాలని, లేకపోతే గౌరవంగా రాజీనామా చేసి తప్పుకోవాలని సీఎం రేవంత్ స్పష్టం చేశా రు. పదేళ్ల బీఆర్ఎస్ పాలన, వెయ్యి రోజుల తమ ప్రజా ప్రభుత్వ పాలనపై అసెంబ్లీలో చర్చించ డానికి సిద్ధంగా ఉన్నామన్నారు. 1000 రోజుల ప్రభుత్వంలో కేసీఆర్ ఒక్కరోజైనా సభకు రాలేదు. కానీ రూ.22,24.40.000 కోట్ల జీతభత్యాలు ఉండటానికి ఇల్లు, తిరగడానికి కారు ప్రభుత్వం నుంచి తీసుకుని ఫాంహౌస్ కు వెళ్లిపోయారు. ప్రజల చెమట, రక్తం తో కట్టిన పన్నుల డబ్బును దొబ్బితింటున్న ఈ నాయకుడిని డిస్మిస్ చేయాలా, వద్దా?.. ప్రజలు ఆలోచించాలి అని రేవంత్ వ్యాఖ్యానించారు. అధికారులు 365 రోజులు పనిచేయక పోతే తీసేస్తారని, వెయ్యిరోజులు పని చేయని నాయకుడిని ఏం చేయాలని ప్రశ్నించారు.

# రెచ్చిపోతున్న... 'పేకాట' మాఫియా..!

(మొదటి పేజీ తరువాయి)

జోరుగా సాగిస్తున్నారు. పేకాట ఆడే వారి కంటే నిర్వాహకులకే లాభాల పంట పండిస్తుండడంతో, నిర్వాహకులు రోజుకో స్థావరాలను మారుస్తూ, కేవలం ఫోన్ల ద్వారానే పేకాట రాయులను తమ అడ్డాలకు రప్పించుకుంటూ, అడ్డాల వద్ద కావలసిన సదుపాయాలు, తినే పదార్థాలు, అవసరమైన అన్ని సమకూరుస్తుండడంతో, గుట్టుచప్పుడు కాకుండా పేకాట నిర్వహణ కొనసాగుతుంది. కొత్తవారికి తెలియకుండా, కేవలం పరిచేస్తులకు, తెలిసినవారికి తమ తమ అడ్డాలకు పేకాట నిర్వాహకులు రప్పించుకుని, మూడో కంటికి తెలియకుండా ఒకరోజు ఒకచోట మరో రోజు మరోచోట నిర్వహిస్తూ మూడు పువ్వులు ఆరు కాయలుగా తమ దందాను కొనసాగిస్తున్నారని తెలుస్తోంది. పేకాట స్థావరాల వద్ద పేకాటరాయులకు కావలసిన అన్ని వసతులు సౌకర్యాలు కల్పిస్తుండడంతో మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు ఆట కొనసాగుతుంది. ఇప్పటికైనా పేకాట మాఫియా ఆగడాలను అరికట్టి పేకాట ఆడుతున్న స్థావరాలపై జిల్లా పోలీస్ యంత్రాంగం ప్రత్యేక బృందాలతో పేకాట మాఫియాకు పోలీసులు ఉక్కుపాదం మోపేనా...అడ్డాలు మార్చుకుంటున్న నిర్వాహకుల ఆటకు ఎప్పుడు తెరపడుతుందో వేచి చూడాల్సిందే.

అడ్డాలు మారుతున్నాయి... జూదం మాత్రం ఆగడం లేదు...!

పోలీసులు దాడులు నిర్వహిస్తున్నప్పటికీ పేకాట నిర్వాహకులు ముందుగానే సమాచారం తెలుసుకుని స్థావరాలను మార్చుకుంటున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో దాడులు ఒకవైపు జరుగుతుండగా, మరోవైపు కొత్త ప్రాంతాల్లో పేకాట సాగుతోందన్న ఆరోపణలు ఉన్నాయి.

లాడ్జిలు.. రైస్‌మిల్లులు.. ఫంక్షన్ హాళ్లు...?

పట్టణం, పరిసర ప్రాంతాల్లోని కొన్ని లాడ్జిలు, రైస్‌మిల్లులు, ఫంక్షన్ హాళ్ల తదితర ప్రాంతాలను పేకాటకు ఉపయోగిస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. అయితే ఈ ఆరోపణలపై సంబంధిత అధికారులు పూర్తిస్థాయిలో విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తేవాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు.

ఎవరి అండ..?

గుట్టుచప్పుడు కాకుండా పేకాట సాగుతున్నట్లు ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో నిర్వాహకులకు ఎవరి సహకారం ఉందనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పేకాట స్థావరాల నిర్వహణ వెనుక ఉన్న అసలు వ్యక్తులను గుర్తించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పోలీసుల నిఘా మరింత కట్టుదిట్టం చేయాలి...

పేకాట వల్ల కుటుంబాలు ఆర్థికంగా నష్టపోయే ప్రమాదం ఉండటంతో పాటు యువతపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే జిల్లాలో పేకాటపై పోలీసుల దాడులు, అరెస్టుల వార్తలు వెలువడుతున్న నేపథ్యంలో, బాన్సువాడ పరిసరాల్లోనూ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి అక్రమ జూదానికి అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు. పేకాటరాయుళ్లపై ప్రత్యేక దాడులు చేపడతాం: తుల శ్రీధర్, పట్టణ ఎస్ హెచ్ ఓ, బాన్సువాడ. బాన్సువాడ ప్రాంతాలలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం వచ్చిన వెంటనే దాడులు చేపట్టి కఠిన చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే పేకాట స్థావరాలపై ప్రత్యేక దాడులు చేపట్టి పేకాటరాయలను అరెస్టు చేశాం. ఒకవేళ పేకాట ఆడుతున్నట్లు ఎలాంటి సమాచారం వచ్చిన ఉక్కు పాదం మోపుతాం. ఎంతటి వారినైనా ఉపేక్షించం.

RNI NO . TELTEL2010/34557
తెలుగు దినపత్రిక
దేశటైమ్స్
సత్యం కోసం .... సమాజం కోసం



# బోనకల్ ఆర్ఓబీపై భయానక పరిస్థితులు

**బయటపడుతున్న ఇనుప చువ్వలు.. చీకట్లో ప్రయాణం.. అధికారుల నిర్లక్ష్యంపై ప్రజల ఆగ్రహం**

**శాశ్వత మరమ్మతులు చేపట్టాలి.. ఆర్ఓబీపై విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలి**

**రావినూతల మాజీ సర్పంచ్ ఎస్.కే. వజీర్ డిమాండ్**

**ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 06 (దేశ టైమ్స్):**

బోనకల్ మండల కేంద్రంలోని రైల్వే ఓవర్ బ్రిడ్జి వాహనదారులకు ప్రమాదకరంగా మారింది. జగ్గయ్యపేట--వైరా ప్రధాన రహదారిలో భాగంగా ఉన్న ఈ ఆర్ఓబీపై రహదారి దెబ్బతిని పెద్ద గుంతలు ఏర్పడటంతో పాటు ఇనుప చువ్వలు బయటకు రావడం ఆందోళన కలిగిస్తోంది. నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగించే ఈ మార్గంలో ఏ క్షణంలో ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులకు పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారింది. రోడ్డు దెబ్బతిన్న ప్రాంతాల్లో బయటకు వచ్చిన ఇనుప రాడ్లు టైర్లకు తగిలే అవకాశం ఉండటంతో వాహనదారులు అప్రమత్తంగా ప్రయాణించాల్సి వస్తోంది.



**తాత్కాలిక మరమ్మతులతో ప్రయోజనం ఏంటి?**

ఆర్ఓపై ఏర్పడుతున్న గుంతలకు ఎప్పటికప్పుడు తాత్కాలిక మరమ్మతులు చేస్తున్నప్పటికీ సమస్య శాశ్వతంగా పరిష్కారం కావడం లేదని స్థానికులు అంటున్నారు. మరమ్మతులు చేసిన కొద్దికాలానికే రహదారి మళ్లీ దెబ్బతింటోందని, దీంతో ప్రజాధనం వృథా అవుతోందని విమర్శిస్తున్నారు. తాత్కాలిక పూడికలు కాకుండా నాణ్యతతో కూడిన శాశ్వత మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

రాత్రివేళల్లో మరింత ప్రమాదం ఆర్ఓబీపై సరైన లైటింగ్ సౌకర్యం లేకపోవడం మరో ప్రధాన సమస్యగా మారింది. రాత్రి వేళల్లో వంతెనపై చీకటి నెలకొనడంతో గుంతలు, బయటకు వచ్చిన ఇనుప చువ్వలు కనిపించక వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే పరిస్థితి ఏర్పడుతోంది. వంతెనపై వెంటనే ఎల్ఈడీ వీధి దీపాలు లేదా హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

**ప్రమాదం జరిగిన తర్వాతే స్పందిస్తారా?**

ఇటీవల చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో విలేకరి మంద సత్యానందం మృతి చెందిన ఘటనను స్థానికులు గుర్తుచేస్తున్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన అధికారులు సమస్యను పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఆర్ఓబీపై రక్షణ కంచెలు, హెచ్చరిక బోర్డులు, అవసరమైన భద్రతా ఏర్పాట్లు కూడా చేయాలని ప్రజలు కోరుతున్నారు.



**"లైట్లు ఏర్పాటు చేసి ప్రాణాలు కాపాడాలి"**

రావినూతల మాజీ సర్పంచ్ ఎస్.కే. వజీర్ మాట్లాడుతూ బోనకల్ ఆర్ఓబీపై ప్రమాదాలు జరగకుండా అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. రహదారి దుస్థితిని పూర్తిగా సరిచేసి, ఆర్ఓబీపై విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. "మరమ్మతుల పేరుతో కాలయాపన చేయకుండా ప్రజల ప్రాణాలను దృష్టిలో పెట్టుకుని శాశ్వత పరిష్కారం చూపాలి. రాత్రివేళల్లో ఆర్ఓబీపై వెలుతురు లేకపోవడం వల్ల ప్రమాదాల ముప్పు మరింత పెరుగుతోంది. వెంటనే లైట్లు ఏర్పాటు చేసి ప్రాణాలు కాపాడాలి" అని ఎస్.కే. వజీర్ కోరారు.

# ప్రశాంతంగా వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించాలి

**మండపాలకు తప్పనిసరిగా పోలీసుల అనుమతి**

**రాత్రి 10 తర్వాత డీజేలు, లౌడ్‌స్పీకర్లకు అనుమతి లేదు**

**నిమజ్జనంలో నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు**

**మరిపెడ ఎస్ఐ సతీష్**

**దేశ టైమ్స్ మహబూబాబాద్/మరిపెడ, సెప్టెంబర్ 6:**

వినాయక చవితి ఉత్సవాల నేపథ్యంలో మరిపెడ పోలీసులు అప్రమత్తమయ్యారు. మండల ప్రజలకు ముందస్తుగా వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపిన పోలీసులు.. ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని సూచించారు. ఈ మేరకు మరిపెడ పోలీస్‌స్టేషన్‌లో మండలంలోని వినాయక ఉత్సవ కమిటీల నిర్వాహకులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ప్రతి గ్రామం, ప్రతి కాలనీలో వినాయక మండపం ఏర్పాటు చేసే నిర్వాహకులు ముందుగా పోలీస్‌స్టేషన్‌లో అనుమతి తీసుకోవాలని పోలీసులు స్పష్టం చేశారు. అనుమతి లేకుండా మండపాలు ఏర్పాటు చేయరాదని తెలిపారు. మండపాల ఏర్పాటుతో రహదారులపై ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

**రాత్రి 10 తర్వాత డీజేలకు నో**

ఉత్సవాల్లో డీజేలు, లౌడ్‌స్పీకర్లను అధిక శబ్దంతో వినియోగించరాదని పోలీసులు హెచ్చరించారు. నిబంధనల ప్రకారం రాత్రి 10 గంటల తర్వాత లౌడ్‌స్పీకర్లు, డీజేలను నిలిపివేయాలని సూచించారు. అధిక శబ్దంతో ప్రజలు, వృద్ధులు, చిన్నారులకు ఇబ్బందులు కలిగిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

**విద్యుత్ భద్రతపై అప్రమత్తత**

వినాయక మండపాల వద్ద విద్యుత్ వైర్లు వేలాడకుండా నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. చిన్నారులు విద్యుత్ వైర్లకు దూరంగా ఉండేలా చూడాలని తెలిపారు. ప్రతి మండపం వద్ద ఇసుక లేదా నీటితో కూడిన బకెట్‌ను తప్పనిసరిగా అందుబాటులో ఉంచాలని సూచించారు. వీలైనంత వరకు మండపాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని కోరారు.

**మద్యం సేవించి గొడవలకు పాల్పడితే చర్యలు**

ఉత్సవాల సందర్భంగా మద్యం సేవించి గొడవలకు పాల్పడటం, ఇతరులను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం, శాంతిభద్రతలకు విఘాతం కలిగించడం వంటి చర్యలను సహించబోమని పోలీసులు హెచ్చరించారు. మండపాల వద్ద మహిళలు, చిన్నారుల పట్ల అసభ్యంగా ప్రవర్తించినా, దొంగతనాలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. మట్టి గణపతులనే ప్రతిష్ఠించాలి



పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలకు దూరంగా ఉండాలని పోలీసులు కోరారు. చెరువులు, నీటి వనరులు కలుషితం కాకుండా మట్టి గణపతులను ప్రతిష్ఠించాలని సూచించారు. పర్యావరణహిత రంగులను వినియోగించాలని విజ్ఞప్తి చేశారు. నిమజ్జనంలో జాగ్రత్తలు తప్పనిసరి నిమజ్జన ఊరేగింపులో ట్రాక్టర్లు, డీసీఎంలు, ఇతర వాహనాలపై ప్రమాదకరంగా కూర్చోవడం, వాహనాలపైకి ఎక్కి డ్యాన్స్ చేయడం చేయరాదని పోలీసులు సూచించారు. పోలీసుల సూచించిన మార్గంలోనే ఊరేగింపు నిర్వహించాలని తెలిపారు. చెరువుల వద్ద లోతైన ప్రాంతాల్లోకి వెళ్లకూడదని, ఈత రాని వారు నీటిలోకి దిగరాదని హెచ్చరించారు. నిమజ్జనం రోజున మద్యం సేవించి వాహనాలు నడపరాదని స్పష్టం చేశారు. సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు చెప్పాలి ఉత్సవాల సమయంలో ఎవరైనా అనుమానాస్పదంగా కనిపించినా, ఏదైనా గొడవ లేదా అవాంఛనీయ సంఘటన జరిగినా వెంటనే డయల్ 100కు లేదా మరిపెడ పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని పోలీసులు కోరారు. మండలంలో వినాయక చవితి వేడుకలు ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రశాంతంగా జరిగేందుకు ప్రజలు, ఉత్సవ కమిటీల నిర్వాహకులు పోలీస్‌శాఖకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# శ్రీ లక్ష్మీ నరసింహస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసిన / ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్





**దేశ టైమ్స్ సెప్టెంబర్ 6:**

రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండలకేంద్రంలోని శ్రీ లక్ష్మీ నరసింహస్వామిని దర్శించుకొని ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, శ్రావణమాసం అంటేనే వ్రతాలకు పండుగలకు శుభకార్యాలకు నెలవని అటువంటి శ్రావణమాసంలో శ్రీ లక్ష్మీ నరసింహస్వామిని దర్శించుకోవడం సంతోషంగా ఉందని అన్నారు. ప్రతి సంవత్సరం శ్రావణమాసంలో రుద్రంగి ఇలావేల్పు శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ని దర్శించుకోవడం ఆనవాయితీ అని అన్నారు. ప్రజలు కూడా ఆనవాయితీగా శ్రావణమాసంలో స్వామివారికి బియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకోవడం జరుగుతుందని అన్నారు. ఆ లక్ష్మీ నరసింహస్వామి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆనందంగా వుండాలని వేడుకున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ సామ మోహన్ రెడ్డి, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కు స్వామివారి కండువా కప్పి చిత్రపటాన్ని అందజేశారు. అనంతరం ఆలయ పరిసరాల్లో జరుగుతున్నా అభివృద్ధి పనులను పరిశీలించారు ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతి గ్రామ సర్పంచ్ గడ్డి నారాయణ ఉప సర్పంచ్ మాడిశెట్టి అభిలాష్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎర్రం గంగా నర్సయ్య వార్డు సభ్యులు పూదరి మహిపాల్

# ఆటో డ్రైవర్లకు అండగా సత్యవతి రాథోడ్

**స్వయంగా ఆటో నడిపి నిరసనకు సంఘీభావం. హామీల అమలుపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీత**

**దేశ టైమ్స్ మహబూబాబాద్/మరిపెడ సెప్టెంబర్ 6:**




ఎన్నికల సమయంలో ఆటో డ్రైవర్లకు ఏడాదికి రూ.12 వేల ఆర్థిక సహాయం అందిస్తామని కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ కురవి మండలం పెద్దతండాలో ఆటో డ్రైవర్లు చేపట్టిన నిరసన కార్యక్రమానికి మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ నాయకురాలు సత్యవతి రాథోడ్ సంఘీభావం తెలిపారు. వీనిరసన కార్యక్రమానికి హాజరైన సత్యవతి రాథోడ్ ఆటో డ్రైవర్ల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. వారి ఆందోళనకు మద్దతుగా స్వయంగా ఆటో నడిపి నిరసనలో పాల్గొన్నారు. అనంతరం గ్రామ దేవత బొడ్రాయిని మొక్కి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మంచి బుద్ధి ప్రసాదించాలని కోరుకున్నారు. ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కరించడంతో పాటు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకు అనేక హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వాటి అమలును విస్మరిస్తోందని విమర్శించారు. ఆటో డ్రైవర్లకు ఏడాదికి రూ.12 వేల ఆర్థిక సహాయం అందిస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చి ఇన్ని రోజులు గడిచినా అమలు చేయకపోవడం బాధాకరమన్నారు. ఆటో కార్మికులు తమ జీవనోపాధి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వం వారి సమస్యలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. నిరసనలో పాల్గొన్న ఆటో డ్రైవర్లకు ఆమె కిరాయి అందించి తన సంఘీభావాన్ని చాటుకున్నారు. ఆటో కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, హామీ మేరకు ఆర్థిక సహాయాన్ని అందించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు గడుస్తున్నా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని సత్యవతి రాథోడ్ విమర్శించారు. ప్రభుత్వం వద్ద ఇక మిగిలిన కాలంలోనైనా హామీలను ఎప్పుడు అమలు చేస్తారో ప్రజలకు స్పష్టమైన సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీని తక్షణమే అమలు చేసి వారికి న్యాయం చేయాలని ఆమె కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో పెద్దతండా ఆటో డ్రైవర్లు, కార్మికులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ 1000 రోజుల ప్రజాపాలనపై/బిజెపి నాయకుల ఘాటు విమర్శలు

**రుద్రంగి సెప్టెంబర్ 6 (దేశ టైమ్స్)**



రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండల బిజెపి పార్టీ అధ్యక్షుడు కర్ణావత్తుల వేణు ఆధ్వర్యంలో కార్యవర్గ సమావేశం మరియు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వేణు మాట్లాడుతూ కాంగ్రెస్ అంటేనే అవినీతి అక్రమాలకు కేరాఫ్ అడ్రస్ అని విమర్శించారు. కాంగ్రెస్ 1000రోజుల పాలనలో ప్రజలు సంతోషంగా లేరని అన్నారు. మొన్నటి రేషన్ కార్డుల సభలో ప్రధాని మోడీ ఫోటో పెట్టలేదని అడిగినందుకు ఎమ్మెల్యే ముందే కాంగ్రెస్ నాయకులు మా బిజెపి నాయకుల మీద దౌర్జన్యానికి దిగడం వారి గుండాయిజనికి నిదర్శనం అని అన్నారు. వడ్డెర కాలనీ, ఇందిర చౌక్, మహాలక్ష్మి విధి లో వేసినా సిసి రోడ్లలో నాణ్యత లేదని ఆరోపించారు. కాంట్రాక్టర్ జేబు నింపడానికె రోడ్లను నాణ్యత లేకుండా వేశారని స్థానిక కాంగ్రెస్ నాయకులు వేసిన సిసి రోడ్లను ఎమ్మెల్యే ఒకసారి పరిశీలించాలని కోరారు. కాంగ్రెస్ చెప్పుకుంటున్న ప్రజాపాలనలో అవినీతి అక్రమాలే తప్ప అభివృద్ధి సున్యం అని అన్నారు. బిజెపి నాయకులు ఎప్పుడు శాంతియుతంగా ఉంటూ ప్రజ సమస్యలపై పోరాటం చేస్తారని అన్నారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ ప్రజాపాలనకు ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.. ఈ కార్యక్రమంలో, ఉపాధ్యక్షుడు గండి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి మల్యాల శ్రీనివాస్, కార్యదర్శి బలగం శ్రీధర్, సోషల్ మీడియా ఇన్చార్జ్ మోతే నితిన్, అక్కినపల్లి నరసయ్య, రాచకొండ గంగ నరసయ్య, నెవూరి కిషన్, గసికంటి వెంకటి, నెవురి శేఖర్, గెంటి మల్లయ్య, పడాల రాజేందర్, పండుగ గంగాధర్, పాల్గొన్నారు.

# వాస్తు రత్న అవార్డుతో హనుమదాస్ పీసరి మల్లారెడ్డి కి సత్కారం

**వలిగొండ:సెప్టెంబర్ 6(దేశ టైమ్స్)**

వలిగొండ మండల పరిధిలోని నర్సాపురం గ్రామానికి చెందిన హనుమదాస్ పీసరి మల్లారెడ్డి ప్రతిష్టాత్మక వాస్తు రత్న అవార్డు అందుకున్నారు. సుమన్ ఆర్ట్స్ థియేటర్స్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని బిర్లా ప్లానెటోరియం ప్రాంగణంలోని భాస్కర ఆడిటోరియంలో సాట్ ఐకాన్ 2026 అవార్డుల ప్రదానోత్సవం ఘనంగా నిర్వహించారు. వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందిస్తున్న పలువురు ప్రముఖులను ఈ సందర్భంగా అవార్డులతో సత్కరించారు. కార్యక్రమంలో భాగంగా హనుమదాస్ పీసరి మల్లారెడ్డి వాస్తు రత్న పురస్కారాన్ని తెలంగాణ మాజీ స్పీకర్ మధుసూదనాచారి చేతుల మీదుగా ప్రదానం చేశారు. వాస్తు రంగంలో ఆయన అందిస్తున్న సేవలను గుర్తించి ఈ ప్రతిష్టాత్మక అవార్డుకు ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మధుసూదనాచారి అవార్డు గ్రహీతలను అభినందించారు. సమాజంలోని వివిధ రంగాల్లో ప్రతిభ కనబరుస్తున్న వారిని గుర్తించి సత్కరించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ అవార్డు కార్యక్రమంలో సినీ ప్రముఖులు రుద్రరాజు పద్మరాజు, సుమన్ ఆర్ట్స్ థియేటర్స్ వ్యవస్థాపకులు పల్లె సుమన్, కార్యదర్శి ప్రతీక్ తదితరులు పాల్గొన్నారు. అవార్డు అందుకున్న హనుమదాస్ పీసరి మల్లారెడ్డి పలువురు అభినందించారు.



RNI NO . TELTEL2010/34557
తెలుగు దినపత్రిక
దేశ టైమ్స్
సత్యం కోసం .... సమాజం కోసం

## ఘనంగా జిట్టా బాలకృష్ణారెడ్డి ద్వితీయ వర్ధంతి వేడుకలు

**వలిగొండ సెప్టెంబర్ 6: ( దేశ టైమ్స్)**




మండల కేంద్రంతొ పాటు టేకులసోమారంలో గ్రామంలో బి ఆర్ ఎస్ సీనియర్ నేత తెలంగాణ ఉద్యమకారుడు జిట్టా బాల కృష్ణా రెడ్డి ద్వితీయ వర్ధంతి సందర్భముగా ఆయన అభిమానుల ఆధ్వర్యంలో ఆయన చిత్ర పటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలొ బడుగు సత్యనారాయణ, బత్తిని సహదేవ, చిలుగురి సత్తిరెడ్డి, బొల్లు శ్రీనివాస్, నానచర్ల రమేష్, మస్కు నరసింహ, ఎం డి అఫ్రోజ్, ఎండి సమ్మద్, కంకల కిష్టయ్య, కంకల శ్రీనివాస్, అంబటి మోహన్, లగ్గోని వెంకటేశం, కొండూరు సత్తయ్య, కొండూరు సురేష్, శీలం స్వామి, బతిని రవీందర్, మారగోని శ్రీనివాస్, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## సర్టిఫికెట్ల పరిశీలన!

**మరిపెడ ప్రాజెక్టు సిడిపిఓ ఎం. ఎల్లమ్మ,**
**దేశ టైమ్స్ మహబూబాబాద్‌మరిపెడ, సెప్టెంబర్ 06**



మరిపెడ ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీ పోస్టులకు దరఖాస్తు చేసిన అభ్యర్థులు 7వ, తారీకు నుండి 12వ, తారీకు వరకు సర్టిఫికెట్ల పరిశీలన నిర్వహిస్తున్నట్లు మరిపెడ ప్రాజెక్టు సిడిపిఓ ఎం. ఎల్లమ్మ ఆదివారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం! దంతాలపల్లి మండల పరిధిలోని బొడ్లాడా బీసీ 1 ఎస్ సి 2 వారు 7వ, తారీఖున, మరిపెడ మండలంలోని బాల్య ధర్మారం. 2, మాన్సింగ్ తండా ,గాలి వారి గూడెం, జామ్లాతండా వారు 8 తారీఖున, మరిపెడ మున్సిపాలిటీ పరిధిలోని సీతారాంపురం -3 నాలుగో వార్డు వారు 9 వ తారీఖున, నెల్లికుదురు మండలం పిర్య తండా, మంచ తండా, వారు 10వ తారీఖున, మరిపెడ మండలం తాళ్లవుకల్ గ్రామ పరిధిలోని చాపలతండ,11 వా తారీఖున, నర్సుల పేట మండలం కౌసల్య దేవిపెల్లి గ్రామ పరిధిలోని బీల్యాతండా, వారు 11 వ, తారీకున, నరసింహుల పేట మండలం పరిధిలోని ముదావత్ తండా, పాండ్యా తండా వారు 12వ తారీకున ఉదయం 10 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల లోపు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు, మూడు జిరాక్స్ సేట్లను గెజిటెడ్ సంతకాలతో సకాలంలో హాజరై సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేయించు కోవాలని కోరారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కు రాని అభ్యర్థుల దరఖాస్తులను తిరస్కరించబడునని తెలిపారు.

## ఘనంగా గ్రామదేవతలకు బోనాలు

**వలిగొండ : సెప్టెంబర్ 6 (దేశ టైమ్స్)**



మండలంలోని పులిగిళ్లలో వివిధ కూలసంఘాలు, రజక సంగం ఆధ్వర్యంలో ఆదివారం గ్రామాదేవతలు బంగారు మైసమ్మ, ముత్యాలమ్మ కు బోనాలు సమర్పించారు. మహిళలు డప్పు చెప్పుళ్లతో డోలు వాయిద్యాలతో నెత్తిన బోనం ఎత్తుకొని దేవాలయాల వద్దకు వెల్లి ప్రత్యేక పూజలు నిర్వహించి బోనాలు నావేద్యం సమర్పించి గ్రామ ప్రజలు సుబక్షంగా ఉండాలని మొక్కులు తీర్చుకున్నారు.

## చంద్రబోస్ తనయుడి వివాహ రిసెప్షన్ కు హాజరైన మెగాస్టార్ చిరంజీవి

ప్రముఖ సినీ గీత రచయిత, ఆస్కార్ అవార్డు గ్రహీత చంద్రబోస్ ఇంట పెళ్లి సందడి నెలకొంది. ఈ వేడుకకు మెగాస్టార్ చిరంజీవి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. చంద్రబోస్, ప్రముఖ కొరియోగ్రాఫర్ సుచిత్ర దంపతుల కుమారుడు నంద వివాహం శృతి అనే యువతితో అత్యంత వైభవంగా జరిగింది. తాజాగా హైదరాబాద్‌లో జరిగిన ఈ వివాహ రిసెప్షన్ వేడుకలకు కుటుంబ సభ్యులు, ఆప్తమిత్రులతో పాటు టాలీవుడ్ ప్రముఖులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ కార్యక్రమానికి హాజరైన మెగాస్టార్ చిరంజీవి, నూతన దంపతులు నంద వనమాలి, శృతిలను మనసారా ఆశీర్వదించారు. చంద్రబోస్ దంపతులతో తనకున్న ఆత్మీయ అనుబంధాన్ని చాటుకుంటూ, వారి కుటుంబ వేడుకలో పాలుపంచుకున్నారు. చిరంజీవి రాకతో వేడుక ప్రాంగణంలో కొత్త శోభ సంతరించుకుంది. ఆయన నూతన వధూవరులతో ఫొటోలు దిగి శుభాకాంక్షలు తెలిపారు. ఈ పెళ్లి వేడుకలో మరో విశేషం అందరినీ ఆకట్టుకుంది. చంద్రబోస్ తన భార్య సుచిత్రతో కలిసి వేదికపై ఉత్సాహంగా స్టెప్పులేశారు. అలాగే, సుచిత్ర తన నూతన కోడలు శ్రుతితో కలిసి డ్యాన్స్ చేసి అందరినీ అలరించారు. అత్తాకోడళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచిన ఈ దృశ్యాలు ఆహూతులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ ఆనంద క్షణాలకు సంబంధించిన వీడియోలు, ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.



# గ్రామంలో పడకేసిన పారిశుద్ధ్యం పరిశీలించిన/ బిఆరెస్ పార్టీ నాయకులు





**రుద్రంగి సెప్టెంబర్ 6 (దేశ టైమ్స్)**

రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండలకేంద్రంలో పారిశుద్యం పడకేసి చెత్త చెదారంతో పిచ్చి మొక్కలతో గ్రామం అద్వాన్నంగా మారిందని బిఆరెస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామశాఖ అధ్యక్షుడు దయ్యాల కమలాకర్ ఆధ్వర్యంలో గ్రామంలో తిరుగుతూ పరిశీలించారు. ఈ సందర్భంగా సెస్ డైరెక్టర్ ఆకుల గంగారాం మాట్లాడుతూ. బిఆరెస్ పార్టీ పిలుపు మేరకు గ్రామంలో పెరుకుపోయిన చెత్త చెదరన్నీ పరిశీలించారు. గ్రామంలో పారిశుద్య పనులు జరగక చెత్త చెదారం పేరుకుపోయిందని అలాగే సైడ్ డ్రైనేజిల్లో మురికి నీరు నిలిచి అద్వాన్నంగా మారాయని అలాగే ప్రతి ఇంటిముందు పిచ్చి మొక్కలు పెరిగి ప్రజలు ఇబ్బందులు పడుతున్న సర్పంచ్ మరియు అధికారులు చోద్యం చూస్తున్నారని అన్నారు. కోట్ల నిధులు ఎమ్మెల్యే తీసుకువస్తుండు అని చెప్పే కాంగ్రెస్ నాయకులకు గ్రామంలోని చెత్త చెదారం తీయడానికి పంచాయితీ లో నిధులు లెవ అని ప్రశ్నించారు. బిఆరెస్ ప్రభుత్వంలో పల్లె ప్రగతి ద్వారా గ్రామాలను సస్యశ్యామలం చేసి పరిశుభ్రంగా చేశామని గ్రామపంచాయతీ కి ట్రాక్టర్ లు డంపింగ్ యార్డ్ షౌకార్యలు కలిపించమని అన్నారు. బిఆరెస్ హయాంలో వేసిన సిసి రోడ్లు డ్రైనేజీలు చెక్కు చెదరకుండ ఉన్నాయని కాంగ్రెస్ ప్రభుత్వంలో వేసిన సిసి రోడ్లు కోళ్లు తవ్వితే ధ్వంసం అవుతున్నాయని ఎద్దేవా చేశారు. నాణ్యత లేకుండా వేసిన సిసి రోడ్లపై విచారణ జరపాలని కోరారు. కాంగ్రెస్ 1000 రోజుల పాలన 1000 సంవత్సరాల శాపంగా మారిందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎవ్వరు సంతోషంగా లేరని అన్నారు. నాణ్యమై విద్యుత్ అంటూ రోజు కరెంట్ కోతలు చేస్తున్నారని అన్నారు. 420 హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ కు ప్రజలు తగ్గిన బుద్ధి చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో,మాజీ ఎంపిపి గంగం మహేష్,వార్డు మెంబర్లు ఉప్పులూటీ గణేష్,చెప్యాల గణేష్,దయ్యాల నారాయణ, సింగారపు గంగరెడ్డి,ఏనుగుల రాజు,కదాసు లక్ష్మణ్,బొడ్డు మల్లేశం,తర్రె నరేందర్,గసికంటి కొండయ్య, పాల్గొన్నారు...

# ప్రజల ఆరోగ్యమే లక్ష్యం.. వాసవి క్లబ్ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంప్





**ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 06 (దేశ టైమ్స్):**

ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా వాసవి క్లబ్ శివాలయం స్ట్రీట్ ఆధ్వర్యంలో ఆదివారం ఖమ్మంలో మెడికల్ క్యాంప్ నిర్వహించారు. వాసవి క్లబ్ శివాలయం స్ట్రీట్ అధ్యక్షులు మారెమల్ల రామకృష్ణ ఆధ్వర్యంలో ఈ వైద్య శిబిరం జరిగింది. ఈ సందర్భంగా శిబిరానికి హాజరైన ప్రజలకు వైద్యులు వివిధ ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, వారి ఆరోగ్య పరిస్థితిపై అవసరమైన సూచనలు, సలహాలు అందించారు. ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమానికి తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (TWJF) ఎ-2843 నేషనల్ కౌన్సిల్ సభ్యులు కొదుమూరు జగన్నాథం, ఎలుగోటి వెంకట్ (VRM మీడియా ఛానల్ సీఈఓ) ముఖ్య అతిథులుగా హాజరై మెడికల్ క్యాంప్ నిర్వహణను అభినందించారు. ప్రజలకు అవసరమైన ఆరోగ్య సేవలను అందించేందుకు వాసవి క్లబ్ ఆధ్వర్యంలో భవిష్యత్తులోనూ ఇలాంటి సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ సభ్యులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అందరి సహకారంతో మెడికల్ క్యాంప్ విజయవంతంగా నిర్వహించారు.

# యువజన భారీ ప్రదర్శనను జయప్రదం చేయాలి: ఎల్లంకి మహేష్

**వలిగొండ, సెప్టెంబర్, 06 (దేశ టైమ్స్):**

ఈనెల 8న నిర్వహించనున్న యువజన భారీ ప్రదర్శన, బహిరంగ సభను జయప్రదం చేయాలని ఏఐవైఎఫ్ మాజీ జిల్లా అధ్యక్షుడు ఎల్లంకి మహేష్ పిలుపునిచ్చారు. దుప్పెల్లి గ్రామంలో నిర్వహించిన ఏఐవైఎఫ్ ప్రచారజాతను మాజీ నాయకులు కామ్రేడ్ బాలగోని సత్యనారాయణ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ యువత తలుచుకుంటే ఏదైనా సాధించగలరని అన్నారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని, ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. భగత్‌సింగ్ నేషనల్ ఎంప్లాయిమెంట్ గ్యారంటీ యాక్ట్ (BNEGA) రూపొందించి అమలు చేయాలని కోరారు. ఈనెల 8, 9, 10 తేదీల్లో యాదగిరిగుట్టలో జరిగే ఏఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర 3వ మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎలగందుల అంజయ్య, కట్ల యాదగిరి, నరిగె యాదయ్య, అంబటి అంజయ్య, మొగుళ్ల శేఖర్‌రెడ్డి, మారోజు నరసింహాచారి, సుద్దాల సాయికుమార్, బాలగోని మత్స్యగిరి తదితరులు పాల్గొన్నారు.




Printed, Published and Owned by SAYED PASHA Printed at MUSKAN PRINTERS, H.No. 5-12-391/1/1, Srinivas Colony BTS Nalgonda, Dist. Nalgonda. Pin-508001, Telangana State, Published From: MUSKAN PRINTERS, H.No. 5-12-391/1/1, Srinivas Colony BTS Nalgonda, Dist. Nalgonda. Pin-508001, Telangana State. Editor: SAYED PASHA, RNI No. RNI NO. TEITEL 2010/34557, Cell: 9849758280